యోగాంధ్రపై జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విశాలాంధ్ర -విజయనగరం కంటోన్మెంట్: జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంపై జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ తెలిపారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో 9849167238 మొబైల్ నెంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆయుష్ విభాగం అధికారి డా. బట్టు వరప్రసాద్ కంట్రోల్ రూం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంపై సమాచారం కోసం ఈ కంట్రోల్ రూంను సంప్రదించవచ్చని తెలిపారు.

కుమరాంలో గ్రీన్ అంబాసిడర్ హత్య

పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తి దాడి
పోలీసుల అదుపులో నిందితుడు..!

హత్య కాబడిన ఎద్దు సూర్యనారాయణ

మృతుని ఫైల్‌ఫొటో

విశాలాంధ్ర - జామి: మండలంలోని కుమరాం గ్రామంలోని ఎస్సీ కాలనీలో గ్రామ పారిశుధ్య కార్మికుడు ఎద్దు సూర్యనారాయణ (48) హత్యకు గురయ్యాడు. మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ఎప్పటిలాగే కాలనీకి ముందుగా ఉన్న రచ్చబండ వద్ద సూర్యనారాయణ కూర్చుని ఉండగా, అదే సమయంలో మద్యం మత్తులో ఉన్న వంకా రవి అక్కడ ఒంటరిగా ఉన్న సూర్యనారాయణతో గతంలో ఉన్న పాత కక్షల నేపథ్యంలో వచ్చి గొడవపడ్డాడు. ఈ సమయంలో సూర్యనారాయణను మెడపై ఇష్టానుసారంగా వంకా రవి తన్నడం, కొట్టడంతో సూర్యనారాయణ తీవ్రంగా గాయాల పాలయ్యాడు. బాధతో సమీపంలో ఉన్న ఇంటికి చేరుకున్న సూర్యనారాయణ కుటుంబసభ్యులు వైద్యుని వద్దకు తీసుకువెళ్దామనే సమయానికి మృతి చెందాడు. ఎలా గాయాలు అయ్యాయో తెలుసుకునేందుకు ఇంటినుంచి బైటకు వచ్చిన కుటుంబ సభ్యులకు వాస్తవాలు తెలియడంతో వెంటనే గ్రామ సర్పంచ్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా సమాచారం అందుకున్న వెంటనే ఎస్‌కోట రూరల్ సీఐ ఎల్.అప్పలనాయుడు హత్య జరిగిన ప్రాంతానికి వచ్చి విచారణ చేశారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. జరిగిన సంఘటనపై స్థానికులను, కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు వంకా రవి..

ఎద్దు సూర్యనారాయణ హత్యకు కారణమైన వంకా రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లుగా తెలిసింది. వంకా రవి నేర చరిత కలిగి ఉన్నవాడని, గతంలో అనేక కేసులలో జైలు శిక్ష అనుభవించి వచ్చాడని స్థానికులు

చెబుతున్నారు. హత్యకు సంబంధించి ఎద్దు సూర్యనారాయణ కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అకాల వర్షాల పట్ల నగర పాలక సంస్థ అప్రమత్తం

విశాలాంధ్ర - విజయనగరం: ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు ప్రధాన కాలువలలో నీటి ప్రవాహానికి అడ్డంకుల లేకుండా విజయనగరం నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు కృషి చేస్తున్నారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి నేతృత్వంలో ప్రత్యేక పారిశుధ్య బృందం ప్రధాన కాలువలలో చెత్త ప్రక్షాళన ప్రక్రియను చేపడుతున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి అనుకొని ఉన్న కాలువలో పూడికతీత పనులను ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అలాగే గంటస్తంభం ప్రాంతంలో ఉన్న కాలువలో కూడా చెత్తలను తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కాలువలలో పూడిక చేరిపోవడంతో అక్కడక్కడ నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో భారీగా నీరు చూడడంతో కాలువలలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా పరిశుభ్రపరుస్తున్నామన్నారు. ప్రజలు కూడా ఇటువంటి సమయాలలో కాలువలలో చెత్తలను వేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. మార్కెట్ ప్రాంతం కావడంతో పండ్లు, కాయగూరల వ్యాపారస్తులు తమ వ్యర్థాలను కాలువల్లో పారబోస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. ఇకనుండి చిరు వ్యాపారులు జాగ్రత్తగా ఉండి కాలువలలో వ్యర్థాలను వేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకుడు అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లు కలెక్షన్ చేసే నాథుడే కరువాయే..!

- డిజిటల్ పేమెంట్లు చేసుకోండని సెలవిస్తున్న విద్యుత్ సిబ్బంది
- లబోదిబోమంటున్న నిరక్షరాస్యులు



విశాలాంధ్ర - మెరకముడిదాం: మండలంలో విద్యుత్ బిల్లు చెల్లించాలంటే నరకయాతన పడాల్సిన దుస్థితి. గతంలో విద్యుత్ బిల్లులు కలెక్షన్‌కి బిల్లు కలెక్టరు వచ్చేవారు. ప్రతి గ్రామానికి వెళ్లి రామ మందిరం దగ్గర కూర్చొని విద్యుత్ బిల్లులు వసూలు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో మండలంలో చాలా గ్రామాల ప్రజలు చీపురుపల్లి వెళ్లి కట్టుకోవలసిన పరిస్థితి నెలకొంది. పోనీ చీపురుపల్లి వెళ్తే అక్కడ క్యూ లైన్ బారులు తీరి ఉండడంతో ఆరోజు కట్టడం అవ్వకపోతే మరుసటి రోజు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో బిల్లు మాట దేవుడెరుగు రెండు రోజులు కూలి పోయినట్లేనని వాపోతున్నారు. బిల్లు డబ్బులు కన్నా కూలి డబ్బులు ఎక్కువ పోవడంతో సామాన్య ప్రజానీకం లబోదిబోమంటున్నారు. ప్రజలను నానా ఇబ్బందులు పెడుతూ ఈ విధంగా కరెంట్ బిల్లులు వసూలు చేస్తుండడం దారుణమని చాలామంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరే ప్రతి గ్రామానికి వెళ్లి బిల్లులు కట్టించుకోవలసినదిగా ప్రజానీకం కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ సిబ్బందిని బిల్లు కట్టే వారు అడిగితే డిజిటల్ పేమెంట్ చేసుకోండని సెలవిస్తున్నారు. స్మార్ట్ ఫోన్ వాడకమే తెలియని నిరక్షరాస్య రైతాంగం డిజిటల్ పేమెంట్ ఏ విధంగా చేసుకుంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ యంత్రాంగం తమ గోడు విని కరెంట్ బిల్లులు కలెక్షన్‌కు బిల్లు కలెక్టరులను నియమించాల్సిందిగా కోరుతున్నారు.

వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణ ప్రజలు పర్యావరణ పరిరక్షణ కోసం సంపూర్ణ ఆరోగ్యం కోసం తడి చెత్త పొడి చెత్త వేరుచేసి మునిసిపల్ పారిశుధ్య వాహనాలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి శానిటరీ ఇన్స్పెక్టర్, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో బలిజిపేట రోడ్డు, నాగాసపు వీధి, పాకి వీధి, కోరాడ వీధి కల్లాల ఏరియాలో పర్యటించారు. బలిజిపేట రోడ్డు, నాగాశపు వీధి ఏరియాలలో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించి ఖాళీ స్థలంలో చెత్తలు లేకుండా చూడాలని, కాలువలలో సిల్టు తొలగించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఏఈ ఈశ్వర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

విశాలాంధ్ర - బొబ్బిలి: నందమూరి తారక రామారావు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వారోత్సవాలులో భాగంగా నందమూరి యువసేన ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ రాంబర్కి శరత్ బాబు చేతుల మీదుగా ప్రభుత్వ హాస్పిటల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి యువసేన సభ్యులు పితాని శ్రీనివాసరావు, పడాల శ్రీను, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

విశాలాంధ్ర - తెర్లాం: తెర్లాం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక గ్రంధాలయధికారి సి. హెచ్.కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు, పుస్తక పఠనం నిర్వహించారు. విద్యార్థులను 2 గ్రూపులుగా విభజించి ఒక్కొక్క గ్రూపునకు జనరల్ నాలెడ్జ్, గ్రంధాలయం ఉపయోగాలు, కరెంట్ అఫైర్స్ గురించి ప్రశ్నలు వేసి అడిగి తెలుసుకున్నారు. ఈ క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి జూన్ 6వ తేదీన బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో జి.లత, పాఠకులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో విహారయాత్ర

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: ఎస్.కోట కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో జరుగుతున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో మంగళవారం ఆటవిడుపుగా విహారయాత్రకి పుణ్య గిరి కొండపైకి ట్రెక్కింగ్‌కు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు విలేకరులతో మాట్లాడుతూ వారంలో ఒకరోజు క్రీడాకారులకు ఆటవిడుపుగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వలన క్రీడాకారుల్లో మానసిక ఉల్లాసం పెంపొంది, తోటి క్రీడాకారులతో అన్యోన్యత భావం ఏర్పడుతుందన్నారు. దీనికి కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాల యాజమాన్యం క్రీడాకారులకు బస్సు సౌకర్యం సమకూర్చిందని క్రీడాకారులకు అల్పాహారం దాతలు సమకూర్చారని, కోచ్‌లు మహమ్మద్ ఖలీల్ ఉల్లా, ధరణికాన హారిక, పి.మౌనిక ఇతర కోచ్‌లు క్రీడాకారుల తల్లిదండ్రులు సహాయ సహకారాలు అందించారని అన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల రోజుల ముందు నుండే యోగాపై పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంయుక్త కలెక్టర్, యోగా జిల్లా నోడల్ అధికారి సేతు మాధవన్ తెలిపారు. జూన్ 21న ప్రధాని మోడీ విశాఖపట్నంలో పాల్గొంటారని, ఈ కార్యక్రమం లైవ్ ద్వారా ప్రసారం జరుగుతుందని, ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని వీక్షిస్తూ యోగా చేసేలా ఏర్పాట్లను గావించాలని అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ నెల 21 నుండి కాంపెయిన్ ప్రారంభం అవుతుందన్నారు. ముందుగా మండలానికి ఇద్దరేసి యోగా శిక్షకులను గుర్తించి వారి ద్వారా టీఓటీలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, టి.ఓ.టిల ద్వారా మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 22 నుండి 27 వరకు వరకు టీఓటీ శిక్షణ ఉంటుందని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లకు 5 రోజులు చొప్పున, యోగా నేర్చుకునే వారికీ 3 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. జూన్ 16 నుండి 19 వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్టర్ అయిన ప్రతి ఒక్కరూ తప్పక యోగాభ్యాసన చేయాలని తెలిపారు. జూన్ 16న ఫ్యామిలీ యోగా పేరుతో 4 తరాల కుటుంబ సభ్యులంతా పాల్గొనేల చూడాలని, 17న సీనియర్ సిటిజన్స్ కోసం స్పెషల్ యోగా, 18, 19 తేదీలలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో యోగా పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 21న ఉదయం 7 గంటలకు రాజీవ్ క్రీడా ప్రాంగణంలో కర్టెన్ రైజర్ కార్యక్రమం జరుగుతుందన్నారు. వివరాలకు జిల్లా అయుష్ అధికారి డా. వర ప్రసాద్ 98491 67238కు సంప్రదించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డి.ఆర్.డి.ఏ పి.డి కళ్యాణ చక్రవర్తి, ఆయుష్ వైద్యులు డా.వర ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, జిల్లా విద్యా అధికారి మాణిక్యం నాయుడు, డి.ఎస్.ఓ మధు సుధన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, డి.ఎస్.డి.ఓ, మెప్మ పి.డి. తదితరులు పాల్గొన్నారు.

రూ.1.25 లక్షలతో మడ్డువలస ఎడమ కాలువ పనులు

విశాలాంధ్ర - వంగర: మడ్డువలస ఎడమ ప్రధాన కాలువ పూడికలు తొలగింపు పనులు జరుగుతున్నాయి. పూడిక తీతలో భాగంగా కాలువలో ప్రొక్లెయిన్‌తో చెత్తా చెదారాలను తొలగించారు. మెట్ట మగ్గూరు సెంటర్ నుంచి ఓని అగ్రహారం, సంగాం గ్రామాలకు సంబంధించిన ఆయకట్టు పంటపొలాల వరకు పనులు జరుగుతున్నాయి. ఈ ఎడమ ప్రధాన కాలువ పనులు పూర్తి స్థాయిలో చేసి సాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. కాలువ పనులపై మడ్డువలస ఇంజీనీరింగ్ అధికారి జి.అనిల్‌ను సంప్రదించగా రూ. 1.25 లక్షలు నిధులతో ఈ సిల్ట్ తొలగింపు పనులు చేస్తున్నామన్నారు.

గిరిజన ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాలి

విశాలాంధ్ర - వేపాడ: శత శాతం గిరిజనుల ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని మారిక గ్రామాన్ని అధాని కంపెనీకి అప్పగించవద్దని మంగళవారం ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో మారిక గిరిజనులు జాకేరు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ జాకేరు సచివాలయం పరిధిలో కరకవలస పంచాయతీ శివారు మారిక గ్రామానికి చెందిన మా భూములను మా గ్రామాన్ని అదానికి అప్పగించే నోటిఫికేషన్ జారీ చేయడం ఘోరమన్నారు. ఎటువంటి భూసేకరణ చేయవద్దని, సామాజిక అధ్యయనం కూడా చేయవద్దని మొదటి నుండి తహశీల్దార్ కార్యాలయంలో వంటా వార్పుతో నిరసన తెలియజేయడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయానికి విలువ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరకవలస సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, పోరాట కమిటీ నాయకులు జాలరి వీర్రాజు, గెమ్మెల అప్పలనాయుడు, గమ్మెల శ్రీను, కిల్లో అర్జున్, సిందేరి అసు, గెమ్మల బుజ్జిబాబు, పాతబోయిన దేముడు, పాలి దేముడు, శోభన్‌బాబు, రమేష్, దేముడు, గెమ్మెల బింగు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఉద్యోగులు పారదర్శకంగా పని చేయాలి

ఎమ్మెల్యే కళా వెంకటరావు

విశాలాంధ్ర - చీపురుపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులంతా పారదర్శకతతో పని చేయాలని చీపురుపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు డాక్టర్ కిమిడి కళా వెంకట్రావు అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో చీపురుపల్లి నియోజకవర్గ జాతీయ ఉపాధి హామీ పథకం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ఉద్యోగులంతా ఆయా గ్రామాలలో పార దర్శకతతో పనిచేస్తూ వేతనదారులకు పూర్తిస్థాయి పని దినాలు కల్పించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా డ్వామా పిడి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం, చీపురుపల్లి మండలాల ఏపీవోలు, టీడీపీ యువనాయకులు, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా బహిరంగ వేలం

పాట దక్కించుకున్న బత్తివలస రైతు

విశాలాంధ్ర - పూసపాటిరేగ: మండలంలోని బతివలస ప్రభుత్వ భూములలో ఉన్న తోటల ఫలసాయానికి మంగళవారం ఉదయం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. తహశీల్దార్ తాడి గోవిందరావు స్వయంగా పాటను నిర్వహించారు. ముందుగా వేలంలో పాల్గొనటానికి వచ్చిన వారు ఐదు వేల రూపాయలు ప్రవేశ రుసుం చెల్లించి నమోదు చేసుకొని వేలంలో కూర్చున్నారు. ప్రభుత్వం తరుపున ఎకరాకు ఎనిమిది వేలు అంచనా రాబడి ఉండగా సభ్యులు ముగ్గురు పోటీ పడి లక్ష డబ్బై ఒక వెయ్యికి పళ్ళ సింహాచలం వేలంలో తోట ఫలసాయం దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో బత్తివలస రైతులు ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు విజయనగరం నియోజకవర్గం, టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు అదితి విజయలక్ష్మి గజపతి రాజు నేతృత్వంలో ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున నియోజవర్గ ప్రజలు కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదితి గజపతి రాజు మాట్లాడుతూ విజయనగరం ప్రజలపైన ప్రత్యేకమైన అభిమానం ఉందని తెలుపుతూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ చేరేలా చేయడం, పార్టీ ఆశయాలను, సిద్ధాం తాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు, నాయకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. పార్టీ కోసం నీతి, నిజాయితీతో, క్రమశిక్షణతో పనిచేయాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకొని వెళ్లాలని కోరారు. మహానాడు కార్యక్రమం అనేది టీడీపీ పార్టీకి ప్రతీ సంవత్సరం వచ్చే ఒక పండగ అని, మనందరిది ఒక కుటుంబం అని తెలియ జేసారు, పార్టీ మనకేం ఇస్తుందని కాకుండా, పార్టీకి మనమేం చేసాం అనే కోణంలో ప్రతీ కార్యకర్త ఆలోచన చేయాలని తెలియజేసారు. నిస్వార్థంగా కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీ పదవులు ఇచ్చి గౌరవిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్రోతు నర్సింగ్ రావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అనురాధ బేగం, ఆల్తి బంగారు బాబు, బొద్దల నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ప్రజలే దేవుళ్లు

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

విశాలాంధ్ర -లక్కవరపుకోట: ప్రజలే దేవుళ్ళుగా పనిచేస్తున్న ఏకైక రాజకీయ పార్టీ టీడీపీ అని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలాజీ నివాస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన శృంగవరపుకోట నియోజకవర్గం మినీ మహానాడులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ టీడీపీ అంటే అభివృద్ధి, సంక్షేమానికి పర్యాయపదం అని అన్నారు. నియోజక వర్గంలోని 11 నెలల్లో 125 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరిగాయని అన్నారు. రాబోయే కాలంలో ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్తను కాపాడుకునే బాధ్యత తాము తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీపీ రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు ఇందుకూరు సుధారాణి, రాయవరపు చంద్రశేఖర్, తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా నల్లమారమ్మ పండగ

విశాలాంధ్ర - గంట్యాడ: గంట్యాడ మండలం కరకవలస గ్రామంలో గల ఇందిరమ్మ కాలనీలో మొట్టమొదటిసారిగా నల్లమారమ్మ గ్రామ దేవత పండగ అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామస్తులు, కాలనీవాసులు పండగ సందర్భంగా జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పీరుబండి జైహింద్ కుమార్ పండగకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి కలగాలని జైహింద్ కుమార్ అన్నారు. ప్రధాన పూజారి దొంతల బుచ్చిబాబు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘటాలు పులి వేషాలతో అమ్మవారి ఊరేగింపు జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో కళా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

ఏఐ ద్వారా మానవ కార్యకలాపాల గుర్తింపు సులభం

విశాలాంధ్ర - డెంకాడ: సెన్సార్లు, ఏఐ ద్వారా మానవ కార్యకలాపాల గుర్తింపు చాలా సులభతరమని ఎన్ఐటి సిల్చార్ నిపుణుడు డాక్టర్ బాదల్ సోని అన్నారు. "సెన్సార్ డేటా, స్మార్ట్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను ఉపయోగించి మానవ కార్యకలాపాల గుర్తింపు" అనే అంశంపై లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఒక రోజు సెమినార్ నిర్వహించారు. అధునాతన సెన్సార్ టెక్నాలజీలు, మెషిన్ లెర్నింగ్ విధానాల ద్వారా కార్యాచరణ గుర్తింపుపై దృష్టి సారించిన వ్యవస్థలలో తాజా ఆవిష్కరణలపై విలువైన ఆలోచనలను అందించడంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి. రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అకాడమిక్స్ డాక్టర్ వి.అంజి రెడ్డి, ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ వడమోదుల ప్రసాద్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 సం.ల కఠిన కారాగార శిక్ష

డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు



విశాలాంధ్ర - విజయనగరం టౌన్: 2వ పట్టణ పోలీసు స్టేషన్లో 2023 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు శ్రీకాకుళం జిల్లా గార మండలం, దీపావళి గ్రామానికి చెందిన ఉప్పెనవలస ఉమా మహేశ్వరరావు (20సం.లు)కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కే.నాగమణి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2,500లు జరిమానా విధిస్తూ మంగళ వారం తీర్పు వెల్లడించినట్లు విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే విజయనగరం పట్టణంలో నివాసం ఉంటున్న 14 సంవత్సరాల మైనరు బాలిక 9వ తరగతి చదువుతున్న సమయంలో శ్రీకాకుళం జిల్లా గార మండలం, దీపావళి గ్రామానికి చెందిన ఉప్పెనవలస ఉమా మహేశ్వరరావు (20సం.లు)తో ఇన్‌స్టాగ్రామ్లో పరిచయం ఏర్పడింది. అప్పటి నుండి నిందితుడు ఫోన్లో మాట్లాడుతూ ప్రేమిస్తున్నానని నమ్మించి, మోసం చేసి, మైనరు బాలికను శ్రీకాకుళం తీసుకొని వెళ్ళి అత్యాచారానికి పాల్పడినట్లుగా విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయగా, అప్పటి 2వ పట్టణ ఇన్స్పెక్టరు సిహెచ్.లక్ష్మణ రావు పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేశారు. అనంతరం, ఈ కేసును అప్పటి విజయనగరం మహిళా పిఎస్ ఇన్స్పెక్టరు బి.నాగేశ్వరరావు దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు.

ఈ కేసులో ప్రాసిక్యూషను పూర్తయ్యే విధంగా 2వ పట్టణ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టరు టి.శ్రీనివాసరావు చర్యలు చేపట్టగా, నిందితుడు ఉప్పెనవలస ఉమా మహేశ్వరరావు (20సం.లు) మైనరు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లుగా నేరం రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి నిందితుడికి 20 సంవత్సరాలు కఠిన కారాగారం, రూ.2,500/-ల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేసులో బాధితురాలికి రూ. 2లక్షల పరిహారంగా ఇప్పించాలని పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తీర్పును వెల్లడించారు.

ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యేవిధంగా పోలీసుల తరుపున పోక్సో కోర్టు ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటరు మెట్టా ఖజానారావు వాదనలు వినిపించగా, 2వ పట్టణ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టరు టి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో కోర్టు పిసి టి.లక్ష్మి, సి.ఎం.ఎస్. హెచ్సీ సిహెచ్. రామకృష్ణ సాక్షులను కోర్టులో హాజరుపర్చారన్నారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా పోలీసువారి తరుపున వాదనలు వినిపించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెట్టా ఖజానారావు, ఇతర అధికారులను డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు అభినందించారు.

మండలానికి చేరుకున్న విద్యార్థుల స్కూల్ బ్యాగులు

విశాలాంధ్ర - వేపాడ: 2025 -26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు మండల కేంద్రమైన వేపాడ మండల విద్యా వనరుల కేంద్రానికి చేరుకున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఎస్.నాగభూషణరావు తెలిపారు. మంగళవారం సర్వ శిక్ష అభియాన్ జిల్లా కేంద్రం నుండి మండల కేంద్రానికి రాగా ఈ బ్యాగులను దింపించి మండల విద్యా వనరుల కేంద్రంలో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఎంటి,ఎం ఆర్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఆవును చంపిన కసాయి

ఆవును చెర పడుతుండగా పట్టుకున్న స్థానికులు

విశాలాంధ్ర - పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామంలో అవును అతి దారుణం కోసి ప్రాణాలు తీసిన ఘటన సంచలనం అయింది. అదే తరహాలో సోమవారం మధ్యన సమయం లో మరొక ఆవును కాళ్ళు నాలుగు ను ఆవు మెడను కలిపి కట్టి చంపటానికి ప్రయత్నిస్తుండగా స్థానికులు చూసి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ దుర్గా ప్రసాద్ అందించిన వివరాల ప్రకారం కొమరాడ మండలం లో పెల్లి గుడ్డి గ్రామానికి చెందిన నల్లమల్లి చంటి తండ్రి మోహనరావు అనే వెక్తి కొంత కాలం గా కుమిలి గ్రావెల్ కోరి లో జేసిబీ ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు. ఇతనికి ఒక వింత మానసిక స్థితిలో ఉండి ఇటు వంటి దారుణ పనులకు పాల్పడుతున్నాడని ఆయన తెలిపారు. బాధితులు ఇచ్చిన పిర్యాదు మేరకు విచారణ చేస్తున్నాము అని తెలిపారు.

జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షునిగా అవినాష్

నూతన నియామకం చేపట్టిన జిల్లా పార్టీ అధ్యక్షుడు చిన్న శ్రీను

విశాలాంధ్ర-జామి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుభంద సంఘాలకు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుల నియమాకాలను చేపట్టారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిన్న శ్రీను ఆద్వర్యంలో అనుభంద సంఘాల అధ్యక్షలు జాబితాలను సిద్ధం చేసారు. త్వరలో ఈజాబితాలను వెల్లడించనున్నారు. ఇదిలా వుండగా వైసీపీలో కీలకంగా ఉన్న జిల్లా యువజన విభాగం అధ్యక్ష పదవికి జామికి చెందిన యువనేత అల్లు అవినాష్‌ను ఎంపిక చేసారు. పార్టీకి అంకిత భావంతో పనిచేసే అల్లు పద్మ, అల్లు సత్యాజీ కుమారుడైన అవినాష్ పార్టీ కార్యక్రమాలలో చురుకు పాల్గొనడం జరుగుతుంది. ఇంజినీరింగ్ పట్టబద్రుడైన అల్లు అవినాష్ యువన్యాయవాదిగా కూడా ఉన్నారు. నిత్యం ప్రజలతో సన్నిహిత సంభందాలు కలిగి ఉండడమే కాకుండా యువతను ఆకట్టుకునే నేర్పు, సహనం ఆయనకు ఉన్నాయి. అంతేకాకుండా అల్లు అవినాష్ కుటుంబ వైసీపీ పార్టీకి జామి మేజర్ పంచాయితీని కంచుకోటగా మార్చారు., అలాగే చిన్న శ్రీనుకు వీర విదేయులుగా ఉన్నారు. ఇవన్నీ పరిశీలించిన ఆనంతరం అల్లు అవినాష్‌ను జిల్లా యువజన విభాగం అధ్యక్షునిగా చిన్న శ్రీను నియమించినట్లుగా తెలిసింది. ఈవిషయమై అవినాష్‌ను అడుగగా పార్టీ అప్పటించిన ఏబాధ్యత అయినా చిత్తశుద్ధితో నిర్వహిస్తానని తెలిపారు.

క్రీడా మైదానాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర -విజయనగరం: క్రీడా మైదానాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకర వాతావరణం కల్పించే విధంగా ఉంచాలని క్రీడాకారులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. ఆయన ఆదేశాలతో మంగళవారం రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది జంగిల్ క్లియరెన్స్, పారిశుధ్య విధానాలను చేపట్టారు. తుప్పలు, చెత్తాచెదారాలను తొలగించి పరిశుభ్రపరిచారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అటువంటి క్రీడలకు తర్ఫీదు నిచ్చే క్రీడా మైదానాలు కూడా పరిశుభ్ర వాతావరణంలో ఉంచుకోవాలని చెప్పారు. క్రీడ మైదానాలకు వచ్చే క్రీడాకారులు చెత్తాచెదారాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా క్రమ పద్ధతి పాటించాలన్నారు. క్రీడా మైదానాలలో ఏర్పాటుచేసిన చెత్తబుట్టలలో మాత్రమే చెత్తలను వేసి తద్వారా స్ఫూర్తిగా నిలవాలని సూచించారు.

యోగాంధ్ర విజయవంతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర -విజయనగరం: నెలరోజుల పాటు నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా కృషి చేయాలని అడ్మిన్ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన యోగాంధ్ర వివరాలను వెల్లడించారు. ఈనెల 21వ తేదీన ఉదయం 7 గంటలకు రాజీవ్ క్రీడా మైదానం నందు యోగాంధ్ర నెల రోజుల కార్యక్రమం ప్రారంభ సూచికగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అది లగాయితూ ప్రతిరోజు యోగాకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించే విధంగా సచివాలయ పరిధిలో కృషి చేయాలని చెప్పారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించే విధంగా చూడాలన్నారు. అలాగే మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించాలన్నారు. వృద్ధులతో ఒకరోజు యోగ ప్రక్రియలు నిర్వహించాలన్నారు. మూడు, నాలుగు తరాలకు చెందిన కుటుంబ సభ్యులతో యోగా చేయించే విధంగా అవగాహన తీసుకురావాలన్నారు. ఈ విధంగా ప్రభుత్వం నిర్దేశించిన నెల రోజుల కార్యక్రమాలను నిర్వహించి, యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు పాల్గొన్నారు.

పేద బాలికకు అండగా అమ్మ సేవా సంస్థ

విశాలాంధ్ర-జామి: నిరుపేద చిన్నారికి అమ్మసేవాసంస్థ ఆర్థికరంగా అండగా నిలిచి తన సేవా దృక్పదాన్ని తెలియజేసింది. మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన శంకర్ రైస్‌మిల్లులో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వారి నాలుగేళ్ళకుమార్తెకి నాలుక పైకి వచ్చి గాలి పీల్చుకోవడానికి,ఆహారం తీసుకోవడానికి ఇబ్బంది పడుతోంది. ఇప్పటికే వారి వద్దనున్న

నగదుతోపాటు,గ్రామంలో యువత,ఉద్యోగుల,పెద్దల సహాయంతో ఆపరేషన్ చేయించారు. అయినా మార్పు రాకపోగా రాయవెల్లూరులో నయం అవుతుందని, అందుకు రూ.5లక్షలు అవుతుందని వైద్యులు తెలియజేయడంతో ఆర్థిక భారంతో అల్లాడి పోయారు. ఈసమయంలో స్థానిక భార్గవ్ హెల్ప్‌లైన్ వ్యవస్థాపకులు, రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కంది వెంకటరమణ అమ్మసేవా సంస్థ సభ్యులు అల్లం పురుషోత్తం దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో సంస్థ స్పందించి తమవంతు సాయంగా చిన్నారి చికిత్సకు ఇప్పటికే రూ.30వేలు ఇవ్వగా, అదనంగా మరో లక్షా యాభైవేల రూపాయాలను మంగళవారం చిన్నారి తల్లిదండ్రులకు అందజేసారు. సంస్థ చేసిన సాయానికి కంది వెంకటరమణతోపాటు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు

విశాలాంధ్ర - చీపురుపల్లి: కడపలో జరగనున్న మహానాడు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని చీపురుపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం జరిగిన చీపురుపల్లి నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, చీపురుపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఇంచార్జ్ కే త్రిమూర్తులు రాజు ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిమిడి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పార్టీ అధిష్ఠానం సముచిత స్థానం కల్పిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. తెలుగువాడి తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ దశ దిశల వ్యాపింపజేసిన ఘనత ఖ్యాతి ఎన్టీ రామారావుకి దక్కిందని ఆయన అన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్ అని ఆయన అన్నారు. ఎన్టీ రామారావు ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జండా వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మినీ మహానాడు సందర్భంగా ఈ ప్రాంగణం అంతా పసుపు మయం అయింది. పార్టీ పునాదులు బలపడేలా, ప్రజా సంక్షేమ లక్ష్యంగా ముందుకు సాగుతున్న మన టీడీపీ కుటుంబానికి ఇది మరొక మైలురాయి అని కిమిడి అన్నారు. ఈ కార్యక్రమంలో కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, రౌతు కామ నాయుడు, దన్నాన రామచంద్రుడు, శనపతి శ్రీనివాసరావు, తాడ్డే సన్యాసినాయుడు, కోట్ల మోతిలాల్ నాయుడు, పార్టీ చంద్రశేఖర్, గవిడి నాగరాజు, వెన్నె సన్యాసినాయుడు, తిరుమల రాజు, కిరణ్, సారీ పాక సురేష్, పైలే బలరాం, బలగం వెంకట్రావు, రెడ్డి గోవింద నాయుడు, గద్దె అనురాగ్, చనమల్ల మహేశ్వరరావు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- రోటరీ జిల్లా చైర్మన్ జెసి రాజు

విశాలాంధ్ర - బొబ్బిలి : రోటరీ క్లబ్ మరియు ఎన్ అర్ ఐ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రక్త నాళాలు ఉబ్బటం మరియు రక్తహీనత సంబంధిత వ్యాధులపై నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని బొబ్బిలి పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రోటరీ జిల్లా అధ్యక్షులు జెసి రాజు పిలుపునిచ్చారు. మంగళ వారం స్థానిక రోటరీ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్ రోటరీ సభ్యులు మరియు వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి రాజు మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన ఎన్అర్ఐ హాస్పిటల్ ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. దీనిలో వెరికోస్ వెయిన్ (రక్తనాళాలు వాపు, మూసుకొని పోవటం)ను నిర్ధారించదానికి చేసే 4వేల రూపాయల విలువైనవాస్క్యులర్ డోప్ లర్ పరీక్షను ఉచితంగా నిర్వహిస్తారన్నారు. వేస్క్యులర్ సర్జన్ డాక్టర్ మరడా గణేష్ కుమార్,జనరల్ మెడిసిన్ డాక్టర్ లక్ష్మీ మైథిలి పర్యవేక్షణలో వేరికోస్ వెయిన్, దయాబెటిక్ ఫూట్ అల్సర్ మరియు రక్తనాళాలు వ్యాధి చికిత్సలు, అవగాహన ఉచితంగా అందిస్తారన్నారు. హాస్పిటల్ సిఈఓ, రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసన్ మాట్లాడుతూ చాలా మంది రక్తనాళాలు సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారని ముందుగానే నిర్ధారణ చేసుకుంటే చికిత్స సులభం అవుతుందన్నారు. బొబ్బిలిలో ఈ విధమైన వైద్య శిబిరాన్నిమొదటి సారిగా నిర్వహిస్తున్నామని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో రోటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కె రామ కృష్ణ, హాస్పిటల్ మేనేజర్ అవినాష్, పి అర్ ఓ లు చంద్ర శేఖర్, దుర్గా ప్రసాద్ రోటరీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందాలి

నగర పాలక కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర - విజయనగరం: సచివాలయాల ద్వారా మెరుగైన పౌర సేవలు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. మంగళవారం నగరంలోని 35 వ నెంబర్ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విజిట్ బుక్ లను గమనించారు. సచివాలయ పరిసర ప్రాంతాలను కలియతిరిగి పారిశుధ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయానికి సచివాలయ కార్యదర్శులు అందరూ విధులకు హాజరై ప్రజలకు మంచి సేవలను అందించాలని అన్నారు. ఇందుకోసమే నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, రికార్డులు సక్రమంగా లేకపోయినా తగు చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయ కార్యాలయంతో పాటు పరిసర ప్రాంతం పరిశుభ్ర వాతావరణంలో ఉంచాలన్నారు. ప్రభుత్వం నిర్దేశాలను అనుసరిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలను అందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.

టిడిపి మహానాడులో ఎమ్మెల్యే బేబి నాయన, ఎంపీ కలిశెట్టిలు

విశాలాంధ్ర - బొబ్బిలి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గం, తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే ఆర్ ఎస్ కె కె రామారావు (బేబి నాయన) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అప్పలనాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే బేబి నాయనపై, బొబ్బిలి ప్రజలపైన ప్రత్యేకమైన అభిమానం ఉందని తెలుపుతూ, బేబీ నాయన ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ చేరేలా చేయడం, పార్టీ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు, నాయకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. టిడిపి పార్టీ కోసం నీతి, నిజాయితీతో, క్రమశిక్షణతో పనిచేయాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకొని వెళ్లాలని కోరారు. మహానాడు కార్యక్రమం అనేది తెలుగుదేశం పార్టీకి ప్రతీ సంవత్సరం వచ్చే ఒక పండగ అని, మనందరిది ఒక కుటుంబం అని తెలియజేశారు.టిడిపి పార్టీ మనకేం ఇస్తుందని కాకుండా, పార్టీకి మనమేం చేసాం అనే కోణంలో ప్రతీ కార్యకర్త ఆలోచన చేయాలనీ తెలియజేసారు, నిస్వార్ధంగా కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీ పదవులు ఇచ్చి, గౌరవిస్తుందని, దానికి తానే ఒక మంచి ఉదాహరణ అని చెప్పుకోచ్చారు.సమావేశంలో హాజరైన నాయకులు మరియు కార్యకర్తలు ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ యొక్క సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ చేస్తున్న కృషిని కొనియాడారు. రాష్ట్రంలో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని అభినందిస్తూ, పార్టీని మరింత బలోపేతం చేయడానికి తమవంతు కృషి చేస్తామని కార్యకర్తలు, నాయకులు సమక్షంలో సంకల్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బుడా చైర్మన్ చైర్మన్ తెంటు లక్షుమనాయుడు నియోజకవర్గం మండల పార్టీ ప్రెసిడెంట్స్, సీనియర్ నాయకులు,ముఖ్యనాయకులు, %ఖూా% సభ్యులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వైభవంగా శ్రీశ్రీశ్రీ పైడితల్లమ్మ పండగ

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామ ఆరాధ్య దేవత శ్రీశ్రీశ్రీ పైడితల్లమ్మ తల్లి పండగ మహోత్సవం ఉత్సవ కమిటీ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ అమ్మవారి పండగ మహోత్సవం సందర్భంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం,డప్పు వాయిద్యాల నడుమ,కాంగో నృత్య ప్రదర్శనలతో గ్రామ ప్రవీదుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు.అలాగే రెండో రోజు మంగళవారం అనుపోత్సవం సందర్భంగా ఉదయం 6గంటల నుండి అమ్మవారికి దూప దీప నైవేద్యాలతో పాటు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఉత్సవ కమిటీ గ్రామస్తులు అమ్మవారి బండి ప్రభను దిగ్విజయంగా నిలిపారు.అలాగే మధ్యాహ్నం మూడు గంటల నుండి గ్రామ పురవీధుల్లో ప్రదర్శించిన అమ్మవారి వేషధారణలతో ప్రదర్శనలు, అలాగే మహిళా కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.ఈ పండుగ మహోత్సవానికి గ్రామస్తులు తమ ఇంటి అల్లుళ్లను ఆడపడుచులను బంధువులను స్నేహితులను ఆహ్వానించగా గ్రామమంతా జనసందరంగా మారడంతో వాతావరణం ఒకసారిగా ఆనందభరితంగా మారింది.సాయంత్రం 6 గంటల నుండి గ్రామంలో అమ్మవారి ఘటాలను ప్రతిని పండగ మహోత్సవం ప్రారంభించి పురవీధుల్లో అమ్మవారి జాతరను ఊరేగింపుగా సాగించి అమ్మవారి గుడి వద్దకు చేరుకొని భక్తులు వారి మొక్కులను చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా రాత్రి 9గంటలకు డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాలు పండగ మహోత్సవానికి విచ్చేసిన భక్తులను గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ పండగ మహోత్సవానికి శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి, రాష్ట్ర కార్యదర్శి గోంపకృష్ణ,గ్రామ పెద్దలు,తదితరులు హాజరైనారు.

డిబిఎస్‌యూ చిట్టిబాబుకు జాతీయ అవార్డు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా వారు భారతరత్న సుబ్రహ్మణ్యం పేరు మీదగా జాతీయస్థాయిలో పేదల అభ్యున్నతికి కృషి చేసేవారికి అవార్డులు ప్రదానం చేయనున్నారు. జాతీయ స్థాయిలో ఇచ్చే ప్రతిష్టాత్మకమైన ఈ జాతీయ అవార్డుకు దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి చిట్టిబాబు ఎంపికయ్యారు. భారతదేశంలో 2024-25 వ సంవత్సరానికి గాను 14 మందిని ఎంపిక చేయగా అందులో పెంకి చిట్టిబాబు ను దళిత ఆదివాసీల బహుజనుల జీవితాలను మార్చేందుకు గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న సేవలకు గాను అందులో చోటు దక్కింది. దళిత ఆదివాసి మానవ హక్కుల పరిరక్షణ ఉద్యమంలో చేసిన కృషిని గుర్తించి అవార్డు తో పాటు ఒక లక్ష రూపాయల అవార్డు ప్రధానోత్సవం చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డును మే 22 వ తేదీన ఇండియన్ హాబిటేట్ సెంటర్, న్యూ ఢిల్లీ లో అందుకోనున్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడం పట్ల పెంకి చిట్టి బాబు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరియు దళిత ఆదివాసీల బ్రతుకుల్లో మార్పు చేసేందుకు మరింత బాధ్యత పెరిగిందని తెలియజేశారు.

వైసీపీ ఆర్టిఐ విభాగం అధ్యక్షునిగా సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర -జామి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అర్ టీ ఐ విభాగం అధ్యక్షునిగా జామి మండలానికి చెందిన చింతాడ సర్పంచ్ అప్పాన సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. సోమవారం జిల్లా వైసిపి అధ్యక్షుడు చిన్న శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అన్ని విభాగాలకు అధ్యక్షులను నియమించడం జరిగింది. అందులో భాగంగా ఆర్టిఐ విభాగానికి అధ్యక్షునిగా సుబ్రహ్మణ్యం నియమిస్తున్నట్లు జిల్లా పార్టీ అధ్యక్షులు చిన్న శ్రీను తెలిపారు. త్వరలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అన్ని అనుబంధ సంఘాల జాబితాలను విడుదల చేయనున్నారు.

యోగా దినోత్సవానికి ఏర్పాట్లు

విశాలాంధ్ర - తెర్లాం: జూన్ 21న యోగా దినోత్సవం సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తహశీల్దార్ హేమంత్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన ప్రణాళికను జాయింట్ కలెక్టర్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పాల్గొన్నారు. అలాగే ఎం డి ఓ ఆర్ రాంబాబు, ఎస్ ఐ సాగరబాబు, ప్రధాన ఉపాధ్యాయులు, హెల్త్ డిపార్ట్మెంట్, కింద స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

విశాలాంధ్ర - విజయనగరం: క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య వలు ప్రాంతాలలో పర్యటించి పారిశుధ్య విధానాలను గమనించారు. కృష్ణరాజపురం, రింగ్ రోడ్, భగవాన్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనితీరును పరిశీలించారు. చినుకులు పడుతున్న సమయంలో రహదారుల పరిశుభ్రత ఏ విధంగా చేపడుతున్నారు అన్న విషయాన్ని గమనించారు. చిన్నచిన్న కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను వెంటనే తొలగించాలని సిబ్బంది ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న సమయంలో వర్షపు నీరు కాలువలో ప్రవహించకుండా రహదారి పైకి వస్తుందని కావున ఎప్పటికప్పుడు కాలువల పరిస్థితిని గమనిస్తూ ఉండాలని సచివాలయ కార్యదర్శులకు సూచించారు. అనంతరం అన్న క్యాంటీన్ పరిశీలించి, అక్కడ ప్రజలకు అందుతున్న ఆహారం ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి సానుకూల స్పందన రావడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు.

ముగిసిన గ్రామదేవత సిరిమాను

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో కుసుమూరు గ్రామంలో బొబ్బిలి సిఐ నారాయణరావు ఆధ్వర్యంలో గ్రామ దేవత సిరిమాను ఉత్సవం ఘనంగా

ముగిసిందని ఈ ఉత్సవాలలో పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూశారు. స్థానిక ఎస్ ఐ సాగర్ బాబు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

పైడితల్లమ్మ పండగలో ఎమ్మెల్యే కోళ్ళ

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామంలో జరిగిన శ్రీశ్రీశ్రీ పైడితల్లమ్మ పండగ మహోత్సవానికి శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి మంగళవారం హాజరయ్యారు. గ్రామానికి చెందిన కూటమి నాయకుడు బిజెపి మండలాధ్యక్షుడు గోకాడ మహేష్ ఆహ్వానం మేరకు పండగ మహోత్సవానికి హాజరై శ్రీ పైడితల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గోకేడ మహేష్ ఇంటికి వెళ్లి తమ ఆతిథ్యం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట మండల మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.